ఈనాడు
ప్రకాశం
సోమవారం 14 అక్టోబరు 2024


ఒంగోలు: కళారాల ఉత్సవంలో జన సందోహం.. యువత, కళాకారుల నృత్యాలు


పెద్దదోర్నాల: ఐనముక్కలలో మంతనాలమ్మకు నైవేద్యాలు తీసుకెళ్తున్న భక్తులు

వెళ్తూ వెళ్తూ.. నింపుకొన్నారు జేబులు

- తెల్లకాగితంపై రాసి తెచ్చినా రిజిస్ట్రేషన్లు
- భూములు కట్టబెట్టిన అధికారులు



మార్కాపురం, న్యూస్‌టుడే:

◗ మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామంలోని సర్వే నంబరు 265లో 255.50 గజాల గ్రామ కంఠం భూమికి ఎటువంటి దస్త్రాలు లేవు. దీనిపై అక్రమార్కుల కళ్లు పడ్డాయి. ఓ తెల్లకాగితంపై తమదంటూ రాసుకున్నారు. వీఆర్వో, సర్వేయర్‌లతో సంతకాలు చేయించారు. సదరు దస్త్రాన్ని కనీసం పరిశీలించకుండానే ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేశారు.

◗ మార్కాపురం మండలం పెద్దనాగులవరంలోని 230 గజాల గ్రామకంఠం భూమిని రూ. లక్ష తీసుకుని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేశారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను కూడా గత నెల 26న బదిలీపై వెళ్తున్న ఓ అధికారి తుంగలో తొక్కారు. తనకు డబ్బులు ముట్టజెప్పిన వారికి వెళ్తూ వెళ్తూ అక్రమ పద్ధతిలో భూములు కట్టబెట్టేశారు. దస్త్రాలు ఏమాత్రం పరిశీలించకుండా జేబులు నింపుకొన్నారు.

◗ శ్మశాన వాటిక సర్వే సంఖ్యతో...: మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల వరకు విధులు నిర్వహించిన అధికారి వ్యవహార తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. ఇక్కడి కార్యాలయంలో క్రయ, విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు రోజుకు సుమారు 50 వరకు సాగుతుంటాయి. నిబంధనల ప్రకారం అన్ని రికార్డులు పరిశీలించిన తర్వాత రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ పనిచేసిన అధికారి ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. వేములకోట గ్రామ పరిధిలో ఉన్న అసైన్‌మెంట్ భూమికి భూమికి ఏకంగా శ్మశాన వాటిక సర్వే సంఖ్యతో ఫ్రీహోల్డ్ అంటూ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయాలు ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలంటూ కలెక్టర్, మార్కాపురం ఉప కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌లను కలిసి విన్నవించుకుంటున్నారు.

అమ్మవారి వైభవం
భక్తజన సంబరం


కంభం: రూ. 1.13 కోట్ల విలువైన కరెన్సీ నోట్ల అలంకరణలో వాసవీ మాత


ఒంగోలు: పార్వతీదేవి (గంటాపాలెం) కళారం


ఒంగోలు: మహిషాసుర మర్దిని కళారం


త్రిపురాంతకం: రాజరాజేశ్వరి అలంకారంలో బాలాత్రిపురసుందరీదేవి


పామూరు: ప్రత్యేక అలంకరణలో మదన వేణుగోపాలస్వామి

విజయ దశమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి భక్తులు పూజలు చేశారు. దసరా పర్వదినమైన శనివారం వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమను చల్లగా చూడాలని వేడుకున్నారు. రాత్రి వేళ పార్వేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఒంగోలులో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి ఆదివారం భక్తజనం మధ్య కళారాల ఊరేగింపు అద్భుతంగా ఉత్సాహంగా సాగింది. – న్యూస్‌టుడే బృందం


ఒంగోలు: బంగారు చీర అలంకరణలో రాజరాజేశ్వరి


ఒంగోలు: జమ్మి చెట్టు ఆకులు కోస్తున్న మహిళా భక్తులు




ఒంగోలు: కళారాల ఊరేగింపులో కళాకారుల వేషధారణలు

చీమకుర్తి: హరిహర క్షేత్రంలో పూజలకు హాజరైన మహిళా భక్తులు

జిల్లాకు తుపాను ముప్పు!

- అప్రమత్తమైన తీర ప్రాంత అధికారులు
- ఉద్యోగులందరికీ సెలవులు రద్దు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: సోమవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు తుపాను ముప్పు పొంచి ఉన్నట్లు వచ్చిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కోస్తా తీరప్రాంత మండలాలైన ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండలో జిల్లా అధికారులతో పాటు, తహసీల్దార్లు పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయక చర్యలు చేపట్టేందుకు అందరినీ అప్రమత్తం చేశారు. ఉద్యోగులకు సెలవులు రద్దు చేశారు. సముద్రంలో అలలు ఎగిసి పడుతున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లకుండా హెచ్చరికలు చేశారు. కొత్తపట్నం మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న పర్యటించి పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించారు.

◗ లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి...: ఒంగోలు నగరంతో పాటు, తీర ప్రాంత గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అవసరాన్ని బట్టి పునరావాస కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు వంటి సురక్షిత కేంద్రాలకు ప్రజలను తరలించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఆయా ప్రాంతాల్లోని చౌక ధరల దుకాణాల వద్ద బియ్యం, కందిపప్పు సిద్ధంగా ఉంచారు. పెను గాలుల తీవ్రత దృష్ట్యా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా, సరఫరాలో అంతరాయం వాటిల్లకుండా ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. సమాచార వ్యవస్థ దెబ్బతినకుండా తక్షణమే పునరుద్ధరించేలా ఏర్పాట్లు చేశారు.

- తుపాను నష్ట నివారణ, సహాయక చర్యలు, ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు.
- కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబరు: 1077
- ఒంగోలు ఆర్డీవో కార్యాలయం: 92810 34437, 92810 34441
- విద్యుత్తు సమస్యలపై కంట్రోల్ రూమ్ నంబరు: 94408 17491

వైకాపా పాలకుల నిర్వాకంతో గత అయిదేళ్లు పల్లెల్లో అభివృద్ధి పడకేసింది. తాను ఇవ్వకపోగా. . కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు మంజూరైన ఆర్థిక సంఘం నిధులను కూడా విద్యుత్తు బిల్లుల బకాయిల పేరుతో గత ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో ఊళ్లు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారు. ఈ తీరును నిరసిస్తూ వారంతా ఆందోళనలు చేసినా ఫలితంగా లేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం గ్రామాలను ప్రగతి బాట పట్టించేందుకు నడుం బిగించింది. 'పల్లె పండగ' పేరుతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 'పల్లె పండగ' పేరుతో వారోత్సవాలు నిర్వహించనుంది. ఇందులో సిమెంటు, గ్రావెల్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనుంది.

పల్లె గూటికి అభివృద్ధి పండగ

- రూ.126.19 కోట్ల నిధులతో 1,168 పనులు
- నేటి నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు

◗ జనవరి చివరికి పూర్తయ్యేలా ప్రణాళిక...: 'పల్లె పండగ' వారోత్సవాల్లో భాగంగా చేపట్టనున్న 1,168 అభివృద్ధి పనులను జనవరి నెలాఖరుకల్లా పూర్తి చేసేలా అధికారులు ప్రణాళిక చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ సిమెంటు రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. మార్కాపురం, సంతనూతలపాడులో మురుగు కాలువలు; ఒంగోలులో ఒక గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించారు. దర్శి మరో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు; కనిగిరి నియోజకవర్గం హనుమంతునిపాడులో మూడు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటి మేర నిధులు మంజూరయ్యాయి. మురుగు కాలువల నిర్మాణాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, ఇతర పనులను పంచాయతీరాజ్ శాఖ అధికారులు పర్యవేక్షించనున్నారు. గత వైకాపా ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు ముందు ఓటర్లకు గాలం వేసేందుకు కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు మంజూరు చేసినా.. చేసేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వడంతో పంచాయతీలు కొత్త రూపు సంతరించుకోనున్నాయి.

నియోజకవర్గాల వారీగా చేపట్టనున్న పనులు, మంజూరైన నిధులు...

నియోజకవర్గం	సీసీ రోడ్లు	నిధులు (రూ.కోట్లలో)	మురుగు కాలువలు	నిధులు (రూ.కోట్లలో)
కొండపి	87	16.54	-	-
మార్కాపురం	75	12.40	07	2.60
కనిగిరి	59	14.00	-	-
యర్రగొండపాలెం	136	15.00	-	-
దర్శి	203	14.70	-	-
ఒంగోలు	360	14.40	-	-
గిద్దలూరు	107	14.90	-	-
సంతనూతలపాడు	99	15.55	30	4.65

–న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం



- వారోత్సవాల్లో మొత్తం 1,168 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.
- ఇందుకు గాను రూ. 126.19 కోట్ల నిధులు మంజూరయ్యాయి.
- ఆగస్టు 23న 729 గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు.
- చేపట్టాల్సిన అభివృద్ధి, ఉపాధి పనుల కార్యాచరణకు ఆమోదం తెలిపారు.
- నిధుల లభ్యత ఆధారంగా తొలి విడత పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు పల్లె పండగ
- సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, గ్రావెల్ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయనున్నారు.
- జనవరి నెలాఖరుకల్లా పనులు పూర్తయ్యేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు.



మారిస్తే... ఇష్టంగా తింటాం!

- మధ్యాహ్న బడి భోజనంపై కసరత్తు
- మెనూ అమలుకు అభిప్రాయాల సేకరణ

విద్యార్థులు బడి మానేయకుండా.. ఎవరూ ఆకలితో బాధ పడకూడదనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. అయితే కొందరే సక్రమంగా తింటున్నారు. మరికొందరు అయిష్టతతో వదిలేస్తున్నారు. ఇంకొందరు ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు. బియ్యం బాగాలేకపోవడం, కూరలు రుచిగా చేయకపోవడం, మెనూలో అందించే పదార్థాలపై పిల్లలకు ఆసక్తి లేకపోవడం ఇందుకు కారణమనే అభిప్రాయాలు ఎంతోకాలంగా వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. బడి భోజనంలో లోపాలను సమీక్షా సమావేశాల్లో లేవనెత్తినా నాటి పాలకులు పెడచెవిన పెట్టారు. ఈ నేపథ్యంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం స్పందించింది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంగా పేరు మార్చడంతో పాటు పిల్లలు ఇష్టంగా తినాలంటే ఏం చేయాలి.. ఎలాంటి మార్పులు అవసరం అనే విషయంపై దృష్టిపెట్టింది. ఇందుకు సంబంధించి విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఇటీవల అన్ని జిల్లాల్లో కలెక్టర్ల అధ్యక్షతన ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీల నిర్వాహకులతో మాట్లాడి., డివిజన్ల వారీగా మూడు బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచీ మార్పు చేర్పులపై అభిప్రాయాలు సేకరించారు. నూతన ప్రణాళికను నవంబర్ నుంచి అమలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు:	2,326	మొత్తం విద్యార్థులు:	1,73,664
మధ్యాహ్న భోజనం తింటున్నది:	1,53,560	నిర్వహణకు నెలవారీ ఖర్చు:	రూ. 10 కోట్లు
వంట తయారీ ఏజెన్సీ సిబ్బంది:	4,276		

- న్యూస్‌టుడే ఒంగోలు నగరం

ఇవీ జిల్లా నుంచి చేసిన సూచనలు...

వారం	రోజువారీ మెనూ	కొత్త ప్రతిపాదనలు
సోమ	పొంగల్, కూరగాయల గుడ్డు, వేరుసెనగ చిక్కి	పొంగల్, కూరగాయల పలావ్, గుడ్డుకూర, శనగ చిక్కి
మంగళ	పులిహోర, టమోట పచ్చడి/ దొండ పచ్చడి, ఉడికించిన గుడ్డు	అన్నం, పప్పుకూర, వేయించిన గుడ్డు, రాగి బిస్కెట్/లడ్డూలు
బుధ	కూరగాయల అన్నం, బంగాళాదుంప కూర, ఉడికించిన గుడ్డు, శనగ చిక్కి	వెజ్ బిర్యానీ, గుడ్డుకూర, శనగ చిక్కి
గురు	సాంబార్ బాత్/ లెమన్ రైస్, టమాట, దొండ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ	అన్నం, సాంబారు, పచ్చడి (దోస, బీర, టమాట, వంకాయ) ఉడికించిన గుడ్డు, రాగి బిస్కెట్/లడ్డూలు
శుక్ర	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుసెనగ చిక్కి	అన్నం, ఆకుకూర పప్పు, వేయించిన గుడ్డు, వేరుసెనగ చిక్కి
శని	అన్నం, ఆకుకూర, పప్పుచారు, తీపి పొంగలి, రాగిజావ	అన్నం, వెజ్ కర్రీ, తీపి పొంగలి/కేసరి

◗ సాంబార్ బాత్‌ను రెండూ కలిపి కాకుండా వేర్వేరుగా వడ్డించాలి.
◗ వారంలో అయిదు రోజులు ఇస్తున్న గుడ్డును మూడు రోజులు వేపుడు, కూర రూపంలో ఇవ్వాలి.
◗ పచ్చళ్లల్లో గోంగూర కూడా చేర్చాలి. రాగి జావలో సుగంధ ద్రవ్యాలు కలపాలి.
◗ వారంలో అన్ని రోజులూ రాగిజావ ఇవ్వకుండా కేక్, లడ్డూ, ఎండు ఫలాలతో కలిపి అందించాలి.
◗ సన్నబియ్యం సరఫరా చేయాలి. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల పిల్లలకు వంద గ్రాములు, పై తరగతులకు 150 గ్రాముల బియ్యం కేటాయిస్తున్నారు. వీటి పరిమాణం పెంచాలి. గ్యాస్‌ను రాయితీ ధరకు అందించాలి.
◗ పెరిగే నిత్యావసరాలకు అనుగుణంగా వంట తయారీ నిర్వాహకులకు ధరలు నిర్ణయించాలి.
◗ పశ్చిమ ప్రాంత మండలాల్లో వంటకు అవసరమైన తాగునీటిని ప్రభుత్వమే సరఫరా చేయాలి.
◗ ప్రథమ చికిత్స పెట్టె, ఆప్రాన్‌లు అందించాలి. భోజన పదార్థాల తయారీకి అడుగున మందంగా ఉండే అల్యూమినియం పాత్రలు సమకూర్చాలి. లేనిచోట వంట గదులు నిర్మించాలి. ప్రభుత్వం ద్వారానే కందిపప్పు ఇవ్వాలి.
◗ గ్రామాల్లోని ఆర్వోప్లాంట్ల నుంచి ఉచితంగా నీరు సరఫరా చేయాలి. వారానికి ఒకరోజు మెనూలో ఏదేని పండు, మజ్జిగ కూడా చేర్చాలి.



వైకాపా మహిళా నేత.. రేషన్ బియ్యం మేత

ఒంగోలు నేరవిభాగం, నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఒంగోలుకు చెందిన వైకాపా మహిళా నాయకురాలు ఒకరు రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం గత కొంత కాలంగా సాగిస్తున్నారు. అక్రమంగా తరలించేందుకు నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులోని తన బంధువుల ఇంటిలో వంద బస్తాల వరకు అక్రమంగా నిల్వ చేశారు. వీటిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు శనివారం రాత్రి లారీలోకి ఎత్తుతుండగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. విషయాన్ని ఒంగోలు తాలుకా పోలీసులకు తెలిపారు. సీఐ అజయ్ కుమార్, ఎస్సై ఆంజనేయులు తమ సిబ్బందితో చేరుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎఫ్‌సీఐ గోదాముకు, లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం కిక్కు.. ఎవరికో లక్కు


◗ నేడు 171 దుకాణాలకు లాటరీ


ఏర్పాట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వివరిస్తున్న అధికారులు

ఒంగోలు, న్యూస్‌టుడే: జిల్లాలో నూతన మద్యం దుకాణాల ఏర్పాటు ప్రక్రియ తుది అంకానికి చేరింది. జిల్లావ్యాప్తంగా 171 మద్యం దుకాణాలకు 3,461 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 69.24 కోట్ల మేర ఆదాయం సమకూరింది. దుకాణాల కేటాయింపు ప్రక్రియలో భాగంగా ఒంగోలులో సోమవారం లాటరీ తీయనున్నారు. అధికారుల బృందం లాటరీ తీసి అందులో గెలుపొందిన వారికి దుకాణాలను కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ దుకాణాల స్థానంలో లాటరీలో గెలుపొందిన ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో నూతన దుకాణాలు ఈ నెల 16వ తేదీన ఏర్పాటు కానున్నాయి.

◗ 'మీ కోసం' రద్దు...: మద్యం దుకాణాల కేటాయింపు కోసం లాటరీ ప్రక్రియను నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు, ఇతర ఉన్నతాధికారులు ఈ ప్రక్రియలో పాల్గొనాల్సి ఉంది. దీంతో ఒంగోలు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన 'మీ కోసం' కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు డీఆర్వో శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి దూర ప్రాంతాల నుంచి ఎవరూ రావొద్దని సూచించారు.





నల్లమలలో నెమలి పరవళ్లు..



నల్లమల అడవిలోని జలాశయంలో పర్యాటకుల సందడి

ప్రకృతికి నెలవు నల్లమల అటవీప్రాంతం. కొత్త ప్రపంచంలోకి ఆహ్వానిస్తున్నట్లు ఉండే రాచర్ల రంగనాయక స్వామి సన్నిధి మార్గం పర్యాటకులకు ఎంతో ఆకట్టుకుంటోంది. అక్కడి నెమలిగుండం అందాలు ప్రకృతి ప్రేమికులు, భక్తులను అలరిస్తున్నాయి. ఎత్తైన ప్రాంతం నుంచి దూకే జలపాతం..చుట్టూ ఉన్న అటవీ ప్రాంతంలోని పచ్చని బయళ్లలో సేదతీరేందుకు పలువురు వస్తున్నారు. అక్కడి అపురూప దృశ్యాలు వారికి కొత్త అనుభూతులను పంచుతున్నాయి.

–న్యూస్‌టుడే కంభం (రాచర్ల)






పచ్చదనానికి స్వాగతం.. నెమలిగుండానికి వెళ్లే దారి

ఎత్తైన కొండల నుంచి దూకుతున్న జలపాతం

మలిదశ.. మైమరిచిపోయేలా!

❖ పండుటాకులకు ఆపన్నహస్తం
❖ దాతల సాయంతో సకల వసతులు



ఆహ్లాదకర వాతావరణంలో వృద్ధుల ఆశ్రమం

న్యూస్‌టుడే, తాళ్లూరు :

అష్టకష్టాల్లో ఆఖరి కష్టం వృద్ధాప్యం. అలాంటి దశలో పండుటాకులు పడే అవస్థలు వర్ణనాతీతం. వారి ఇబ్బందులు తీర్చేందుకు ఆయన నడుం బిగించారు. సొంత నిధులు..దాతల చేయూతతో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటుచేసి వారికి సకల వసతులు కల్పిస్తూ అండగా నిలుస్తున్నారు అంబటి వెంకటేశ్వర్ రెడ్డి.

తాళ్లూరు మండలం గుంటిగంగలోని పచ్చని కొండల మధ్య గంగాభవానీ అమ్మవారి ఆలయానికి కూతవేటు దూరంలో 2010లో అంబటి వెంకటేశ్వర్‌రెడ్డి ఎంతో ఉదారంతో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. బీమవర్ల మండలం పాటిమీదపాలేనికి చెందిన ఈయన ఈ ప్రాంతానికి వచ్చి రేకుల షెడ్డును నిర్మించి సేవలు ఆరంభించారు. తదనంతరం దాతలు ఆర్థిక సాయాన్ని అందించడానికి ముందుకు వచ్చారు. దీంతో మరిన్ని సౌకర్యాలు కల్పించారు. ఐయిదేళ్ల క్రితం పెద్ద భవనాన్ని నిర్మించారు. వృద్ధులు ఆహారం భుజించేందుకు వీలుగా డైనింగ్ హాలు, ఆహార పదార్థాల తయారీకి ప్రత్యేకంగా వంట గది నిర్మించారు. వసతి నిమిత్తం గదిలో ఇద్దరు, ఒక్కొక్కరు చొప్పున ఉండే వీలు కల్పించారు. ఉదయం వేళ పూజలు చేసేందుకు విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు.

మూడు పూటలా భోజనం అందిస్తూ..

వృద్ధులకు నిత్యం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఉచితంగా భోజనం అందిస్తున్నారు. పండుగ రోజుల్లో ప్రత్యేక వంటకాలను చేయిస్తారు. దీంతో కష్టాలు, కలతలను మరిచి వృద్ధులు ప్రశాంత జీవనం గడుపుతున్నారు. ఆలయ పరిసరాలు, ఇతర ఆశ్రమాల వద్దకు వెళ్లడం కాలక్షేపం చేస్తూ కుటుంబాల్లో ఎదురైన బాధలు మరిచిపోతున్నారు. కుల, మత, వర్గాలకు అతీతంగా విజయవాడ, నరసరావుపేట, మార్కాపురం, దర్శి, అద్దంకి, చీమకుర్తి, ఒంగోలు, తాళ్లూరు, వినుకొండ, తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు, పురుషులు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు.

ముఖ్యమంత్రి సతీమణి సందర్శించి..

గతేడాది చివరలో చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో అప్పటి వైకాపా ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు పంపించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మార్కాపురానికి చెందిన తెదేపా వీరాభిమాని జంపాల నరసింహారావు మృతి చెందారు. దీంతో భార్య ప్రసన్నలక్ష్మికి జీవనాధారం లేకపోవడంతో ఆమె గుంటిగంగలోని వృద్ధాశ్రమంలో చేరారు. విషయం తెలుసుకున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి యాత్రలో భాగంగా నేరుగా ఆశ్రమానికి వచ్చి ఆమెను పరామర్శించారు. ఆర్థిక సాయాన్ని కూడా అందించారు. ఆశ్రమ నిర్వాహకుల్ని కొనియాడారు.



ప్రసన్నలక్ష్మిని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి



దాతలు అందజేసిన పండ్లు, బియ్యం, ఇతరాలు

బాల్యంలో ఎదుర్కొన్న కష్టాలతో..

బాల్యంలోనే కష్టాలు ఎదుర్కొన్నా. వృద్ధులు చరమాంకంలో అవస్థలు ఎదురైతే పట్టించుకునే వారుండరు. అలాంటి వారి కష్టాలు దూరం చేసేందుకే ఆశ్రమం ఏర్పాటుచేశా. దాతలు ఇతోధికంగా సహకరిస్తున్నారు. ఏటా రూ ఆరు లక్షలు ఖర్చవుతోంది.

– అంబటి వెంకటేశ్వర రెడ్డి, వృద్ధాశ్రమ నిర్వాహకుడు

రూ.60 లక్షల నోట్లతో వాసవీ మాత

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా యర్రగొండపాలెం వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో వాసవీమాత విజయ ధనలక్ష్మి అవతారంలో దర్శమిచ్చారు. రూ.60 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. సూర్య వంశం వారి ఆధ్వర్యంలో పట్టణంలో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కర్పూర హారతులందుకున్నారు. తీర్థప్రసాదాల వినియోగం జరిగింది.



నోట్ల అలంకరణలో అమ్మవారు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినం సందర్భంగా ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయుధపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు సంప్రదాయ వస్త్రధారణతో వేద పండితుల మధ్య ఎస్పీ దామోదర్ దంపతులు పూజలు చేశారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు పూజలు చేశారు. ప్రతి ఒక్కరికీ మేలు జరగాలని ఎస్పీ దామోదర్ ఈ సందర్భంగా అభిలషించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎస్.వి.శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆయుధ పూజలో పాల్గొన్న జిల్లా ఎస్పీ దామోదర్ దంపతులు



పొంగి ప్రవహిస్తున్న హనుమాపురం వాగు

ముంచెత్తిన వాగులు..వంకలు

❖ వరదలో కొట్టుకుపోయిన కారు



నాగన్నవాగులో మునిగిపోయిన కారు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: భారీ వర్షాలకు వాగులు, వంకలు పోటెత్తాయి. వరద తాకిడికి నాగులుప్పలపాడు మండలంలోని పలు రోడ్లు, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. కొత్తకోట, హనుమాపురం వాగులు పొంగి ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. దీంతో ఆ రెండు గ్రామవాసులు జల దిగ్బంధంలో చిక్కుకున్నారు. రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఉప్పుగుండూరు - మాచవరం గ్రామాల మధ్య వాగులు పొంగాయి. ఉప్పుగుండూరు ఆరోగ్య కేంద్రం వద్ద నాగన్నవాగు ప్రవాహంలో బాపట్ల జిల్లా చినగంజాం మండలం నీలాయపాలేనికి చెందిన గుడివాడ రాజేంద్ర తన కారుతో పాటు చిక్కుకున్నారు. వరద తాకిడికి కారు కొట్టుకుపోవడంతో ఆయన హాహాకారాలు చేశారు. నూటయాభై మీటర్ల దూరం వెళ్లాక కంప చెట్ల వద్ద కారు నిలిచిపోయింది. గమనించిన స్థానికులు వాగులోకి దిగి తాళ్ల సహాయంతో ఒడ్డుకు చేర్చడంతో ఆయనకు ప్రాణాపాయం తప్పింది. అనంతరం జేసీబీ సాయంతో కారును బయటకు తీశారు.

17న మంత్రి సత్యకుమార్ పర్యటన

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ ఈ నెల 17న వై.పాలెం మండలంలోని కొలుకుల గ్రామంలో పర్యటించనున్నారు. ఈ మేరకు భాజపా రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు ఆరె.రమణయ్య ఆదివారం వివరాలు వెల్లడించారు. విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి రాఘవులు ఆధ్వర్యంలో కొలుకుల గ్రామంలో నిర్మించే శ్రీహరిహర సేవాసమితి ఆధ్యాత్మిక శిక్షణ ప్రవచనాల కేంద్రం, సాంఘిక సేవా కార్యక్రమాల భవన నిర్మాణానికి శంకుస్థాపన, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వస్తున్నట్లు ఆయన తెలిపారు. మంత్రితో పాటు విశ్రాంత లేబర్ ఎంప్లాయిమెంట్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ గుంటూరు జిల్లా విభాగం అధ్యక్షుడు బాలచంద్ర బాబు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, జనసేన, భాజపా నాయకులు, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

రూ.450 కోట్లతో నీటి సమస్య పరిష్కరిస్తాం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపిలో నీటి సమస్య పరిష్కారానికి నాలుగొందల యాభై కోట్ల రూపాయలు వెచ్చిస్తామని, ఈ మేరకు ప్రతిపాదనలు కూడా పంపినట్లు మంత్రి బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. మారిటైం బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన దామచర్ల సత్య అభినందన సభను ఆదివారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి స్వామి మాట్లాడుతూ..నాడు దామచర్ల ఆంజనేయులుపై కొండపి ప్రజలు ఎంతో ఆదరాభిమానాలు చూపించారని, నేడు మనవడు సత్యపై అదే కొనసాగిస్తున్నారన్నారు. ఇది సహించలేని వైకాపా నాయకులు తెదేపా నేతలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం నుంచి 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పదవి ఇచ్చారని, పోర్టుల అభివృద్ధికి పూర్తి సమయం వెచ్చిస్తానన్నారు. కొత్తపట్నంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేస్తామని, రామాయపట్నం పోర్టును పూర్తి చేస్తామన్నారు. అనంతరం స్థానికులు సత్య, మంత్రి స్వామిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామయ్య చౌదరి, మండల అధ్యక్షుడు యలమంద నాయుడు, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి సీతమ్మ, నారాయణ స్వామి, జనసేన నాయకుడు కనపర్తి మనోజ్‌తో పాటు ప్రసన్నలక్ష్మి, జి. శ్రీనివాసరెడ్డి, వసంతరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళుతున్న మంత్రి స్వామి, మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య తదితరులు

గ్రామోత్సవంలో ఇరువర్గాల ఘర్షణ

❖ కత్తితో దాడి: ముగ్గురికి గాయాలు

టంగుటూరు, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా నిర్వహిస్తున్న వేడుకల్లో ఇరువర్గాల మధ్య రేగిన వివాదం చినికి చినికి గాలివానగా మారి దాడులకు దారితీసింది. ఈ సందర్భంగా ఓ వర్గానికి చెందిన వారు కత్తితో దాడిచేయగా ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..టంగుటూరు మండలం కారుమంచిలో కనకదుర్గమ్మ, అంకమ్మ తల్లి ఉత్సవాలను ఎస్సీ కాలనీకి చెందిన రెండు వర్గాలు వేర్వేరుగా నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో కనకదుర్గమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న వారు బాణసంచా కాల్చగా; అంకమ్మతల్లి ఉత్సవాల్లో పాల్గొన్నవారిపై పడి గాయాలయ్యాయి. దీనిపై బాధితులు వెళ్లి ప్రశ్నించగా, ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన కనకదుర్గమ్మ ఉత్సవంలో పాల్గొన్న వ్యక్తులు కత్తితో అంకమ్మ తల్లి గ్రామోత్సవంలో ఉన్న యశ్వంత్, వల్లూరు రాజు, వంశీపై దాడి చేశారు. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న టంగుటూరు పోలీసులు గ్రామానికి చేరుకొని ఇరువురిని చెదరగొట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఫిర్యాదు మేరకు బత్తుల శ్రీను, కొందరిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా ఆదివారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

అందరున్నా.. అనాథలా..

❖ మూడు రోజులుగా ఇంట్లోనే మృతదేహం

మార్కాపురం, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యులు, తోబుట్టువులున్నా..ఆ అధ్యాపకుడి అంత్యక్రియల నిర్వహణను ఎవరూ పట్టించుకోలేదు. మూడు రోజులుగా మృతదేహం ఇంట్లోనే పడివుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంకు వెనుక బజారులోని పూల సుబ్బయ్య వీధిలో నివాసము ఉంటున్న తాటిచెర్ల శివప్రసాద్ (50) కోటమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. శివప్రసాద్ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తూ క్షయ వ్యాధి బారిన పడ్డారు. దీంతో గత కొంతకాలంగా భార్య కోటమ్మ, ఇద్దరు కుమారులు వేరే ఇంటికి వెళ్లి అక్కడే ఉంటున్నారు. రోజుల క్రితం శివప్రసాద్‌ను గుంటూరులోని వైద్యశాలలో చేర్పించగా..అక్కడి నుంచి ఇంటికి వచ్చేశారు. సరైన పోషణ లేక అనారోగ్యంతో మూడు రోజుల కిందట ఇంట్లోనే మృతిచెందారు. ఆదివారం తీవ్ర దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా వారు సాయంత్రం వేళ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చనిపోయి మూడు రోజులవుతోందన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు మార్కాపురం పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ తమ్ముడు, ఇద్దరు అక్కలున్నా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తికి ప్రాణదానం

❖ తక్షణం స్పందించి రక్షించిన పోలీసులు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆత్మహత్య చేసుకునేందుకు రైలుపట్టాల పైకి వెళ్లిన వ్యక్తిని ఒంగోలు రెండో పట్టణ పోలీసులు రక్షించారు. స్థానిక దేవుడిచెరువు ప్రాంతానికి చెందిన కుంచాల రమేష్ శనివారం రాత్రి భార్యతో గొడవపడి ఇంటినుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం సోదరికి ఫోన్‌చేసి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చెప్పగా, ఆమె వెంటనే రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. సీఐ మేడా శ్రీనివాసరావు తక్షణం స్పందించి రక్షక్ సిబ్బదిని రంగంలోకి దింపారు. జిల్లాకేంద్రంలోని ఐటీ కోర్‌టీమ్ సహకారంతో రమేష్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి రక్షక్ వాహనం విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, కానిస్టేబుల్ కిషోర్ వెంటనే అక్కడకు వెళ్లి రైలుపట్టాలపై ఉన్న రమేష్‌ను గుర్తించి కాపాడారు. వారిని ఎస్పీ దామోదర్ ప్రశంసించారు.

మద్యం మత్తులో గొంతు కోసుకున్న రౌడీషీటర్

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో రౌడీషీటర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సింగరాయకొండలో చోటుచేసుకుంది. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల మేరకు..గ్రామ పరిధిలోని డ్రైవర్‌పేట 4వ వీధిలో తన్నీరు శివమహేష్‌పై రౌడీ షీట్ ఉంది. ఇతను మద్యం మత్తులో చాకుతో గొంతు కోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా క్షతగాత్రుడు తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్నాడు. వెంటనే 108 ద్వారా వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించామని, అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంజాబీ డ్రెస్ వేసుకోవద్దని గొడవ

❖ భార్యను పొడిచి చంపిన భర్త

నాగోలు(హైదరాబాద్), న్యూస్‌టుడే: భార్యను కత్తితో పొడిచి భర్త హత్య చేసిన ఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. టంగుటూరి మండలం కొణిజేడు గ్రామానికి చెందిన గుంజి వెంకటేశ్-సోనీ(32) దంపతులు.. కొంతకాలంగా కొత్తపేట సరస్వతీనగర్‌లో ఉంటున్నారు. 14, 12 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేశ్ భవన నిర్మాణ మేస్త్రీగా, సోని ఇళ్లలో పని చేస్తోంది. కొంతకాలంగా భర్త.. భార్యను అనుమానిస్తుండటంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల సోనీ పంజాబీ డ్రెస్ వేసుకోవడంతో భర్త మండిపడ్డాడు. ఆదివారం ఓ ఇంట్లో పనికి వెళ్లిన భార్యను.. భర్త ఇంటికి తీసుకొచ్చాడు. ఈ సందర్భంగా తిరిగి గొడవ జరగడంతో, ఆమె పంజాబీ డ్రెస్ చింపేశాడు. ఆపై కూరగాయలు కోసే కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె అపస్మారక స్థితికి చేరింది. 108 సిబ్బంది అక్కడికి చేరుకొని, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సరూర్‌నగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భార్యపై దాడి చేస్తున్న సమయంలో వెంకటేశ్ చేతికి సైతం గాయాలయ్యాయి. వాటిని చూపుతూ, తాను వారిస్తున్నా.. తన భార్యే కత్తితో పొడుచుకొని మృతి చెందిందని బుకాయించాడు. మృతురాలి వీపులో సైతం కత్తి పోట్లు ఉండటంతో, భర్త చేసిన హత్యగా పోలీసులు నిర్ధారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 135, రిటైల్ లైవ్ - 157, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్- 259

మార్కాపురం
•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

రబీ సాగుకు సమాయత్తం


పొగాకు నాటేందుకు ఎరువు చల్లుతున్న రైతు

పొదిలి, న్యూస్‌టుడే : పశ్చిమ ప్రాంతంలోని రైతాంగం రబీసాగుకు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు పడుతున్నందున పొలాలు పదునయ్యాయి. ఈ వర్షాలు ఖరీఫ్‌లో వేసిన కంది, మెట్టపైర్లకు మేలు చేకూరుస్తుంది. పొదిలి ప్రాంతంలో రబీలో ఎక్కువగా వాణిజ్యపంటలైన పొగాకు, మిర్చితోపాటు బొబ్బర్లు, అలసంద, పెసర, మినుములు సాగుచేస్తారు. వారం రోజులుగా పడుతున్న వర్షాలకు రైతులు సాగుకు ఉపక్రమించారు. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసిన రైతులు ఎరువులు, విత్తనాలు తెచ్చుకుంటున్నారు. కేవలం వర్షాధారంపై ఆధారపడి ఈ ప్రాంత రైతాంగం ఎక్కువ మంది పంటలు పండిస్తున్నారు. కొంతమంది మందికి మాత్రమే బోర్లతో నీటి తడులు అందిస్తుంటారు. గత రెండేళ్లుగా మార్కెట్ ఆశాజనకంగా ఉండటంతో పొగాకు సాగు పెంచాలన్న ఆలోచనతో రైతులు ఉన్నారు. బోర్డు అనుమతించిన దాని కన్నా అదనంగా పండించడంతో ఈ ఏడాది లాభపడ్డ రైతులు వచ్చే ఏడాది సైతం ధరలు ఆశాజనకంగా ఉండవచ్చన్న ఊహాగానాలతో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మిరప సాగు విస్తీర్ణం పెరగనుంది. పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు మండలాల్లో నీటి వసతి ఉన్న రైతులు మిరప, వరి సాగు చేస్తున్నారు. పెట్టుబడి ఎక్కువైనా బ్యాంకు రుణాలు తీసుకొని మిరప సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో వాతావరణం అనుకూలంగా ఉండటం రైతులకు ఊరట కలిగిస్తుంది.

వరద బాధితులకు చేయూత


విజయవాడలోని సింగ్‌నగర్‌లో బాధితులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న చర్చి సంఘ సభ్యులు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: విజయవాడలోని వరద బాధితులకు బేస్తవారపేటలోని ది సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో చర్చి సభ్యులు చేయూత నందించారు. విజయవాడలో సింగ్‌నగర్‌లోని సుజాతనగర్‌లో శనివారం వరదబాధితులకు 200 దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ మహేష్‌బాబు, ప్రెసిడెంట్ ఎడ్విన్ జయకుమార్, స్త్రీల కన్వీనర్ రజని, పరిమళరూత్, జేసింత, గ్లోరి తదితరులు పాల్గొన్నారు.

భూములతో బంతాట

● ఆన్‌లైన్ పేరిట రెవెన్యూ సిబ్బంది అక్రమాలు ● రైతుల రికార్డులు తారుమారు



నెల క్రితం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

కొనకనమిట్ల, న్యూస్‌టుడే :

కొనకనమిట్ల రెవెన్యూ సిబ్బంది భూములతో బంతాట ఆడుతున్నారు. అమాయక రైతుల జీవనాధారమైన భూమినే అక్రమ సంపాదనకు మార్గంగా మలుచుకున్నారు. రైతులు బ్యాంకు రుణాల కోసం ఆన్‌లైన్‌లో భూమి నమోదు కోసం రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతుంటే.. ఇదే అదనుగా అక్రమాలకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇస్తే చాలు చకచకా పనులు చేసిపెడుతున్నారు. అవసరమైనతే రికార్డులన్నీ తారుమారు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిందే.

సంబంధం లేదంటూ దాటవేత ..


అర్జీ చూపుతున్న రైతు అచ్చయ్య

పెండాల అచ్చయ్యకు తువ్వపాడు సర్వే నెంబరు 477-2ఏలో 3.29 ఎకరాల భూమి ఉంటే.. ఆ భూమిని మరో వ్యక్తి పేరుతో ఆన్‌లైన్ చేసేశారు. అదేమని అధికారులను అడిగితే మాకేమి సంబంధం రికార్డుల్లో అలాగే ఉందంటున్నారని, తన పేరుతో భూమిని మార్చాలని పలుమార్లు అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వలస పోతే...

కల్లం కోటేశ్వరరావుకు, అతని కుటుంబం సభ్యులకు తువ్వపాడు రెవెన్యూ పది ఎకరాల భూమి ఉంది. నీటి వసతి లేకపోవడంతో జీవనోపాధి నిమిత్తం ఆ కుటుంబం వేరే ప్రాంతానికి వలస వెళ్లింది. ఇటీవల గ్రామానికి తిరిగి వచ్చి ఆన్‌లైన్‌లో భూమికి సంబంధించిన దస్త్రాలను పరిశీలించగా ఇతరుల పేర్లతో ఉండటం చూసి కంగుతిన్నారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది ఒకరు తన భార్యపేరిట ఈ భూములను ఆన్‌లైన్ చేయించి పాసు పుస్తకాలు చేయించారు. అధికారులు పలు మార్లు ఫిర్యాదు చేసినా, అర్జీలిచ్చినా ఫలితం లేకుండా పోయిందని కోటేశ్వరరావు వాపోతున్నారు. తన విన్నపంతో తహసీల్దారు స్పందించి నెల క్రితం సర్వే నెంబరు హెచ్చరిక నేమ్ బోర్డు ఏర్పాటు చేశారు. రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది ఆ హెచ్చరిక బోర్డు తొలగించి పంట సాగు చేస్తున్నారంటూ ఆయనకు తెలియజేసినా చర్యలేమీ లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

సరైన పత్రాలు ఉంటే..

గతంలో పని చేసిన అధికారులు చేసిన తప్పుల వల్ల సమస్యలు వచ్చాయి. వాటిని త్వరలో పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులు వద్ద సరైన పత్రాలు ఉంటే వచ్చి పరిష్కారించుకోచ్చు. రైతులు ఫిర్యాదు చేసినా పరిశీలించి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తాం.
– ఆవుల సురేష్, తహసీల్దార్ , కొనకనమిట్ల

నేడు గంధోత్సవం



విద్యుద్దీపాలంకరణలో మహబుబ్‌సుభాని దర్గా

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి నవాబుమిట్టలో సోమవారం మహబుబ్ సుభాని గంధమహోత్సవానికి ముస్లిం సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది ఈ దర్గాలో గ్యార్మీ నెలలో పదకొండు రోజులపాటు జాగారం చేసి 11వ రోజు గంధమహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా దర్గాను రంగులతో తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. కులమతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొంటారు.

ఆలయంలో హుండీ చోరీ


పగులగొట్టిన హుండీ

చింతలపల్లె (కొమరోలు (గ్రామీణం), న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఆలయంలోకి దొంగలు ప్రవేశించి హుండీలోని నగదు, ఆంప్లిఫయర్‌ను చోరీ చేశారు. ఈ సంఘటన ఓబులాపురంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామంలోని సర్వాలమ్మ ఆలయంలో దుండగులు ప్రవేశించి హుండీని పగులగొట్టి అందులో దాతలు వేసిన నగదు దొంగిలించారు. ఆలయ అర్చకులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎంత సొత్తు చోరీ గురైందన్న వివరాలు తెలియరాలేదు.

క్రీడాకారునికి ఆర్థిక సాయం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయికి ఎంపికైన పట్టణానికి చెందిన చిన్నం ఆదినారాయణకు స్థానిక ఎస్‌సీవీకే రీడింగ్ రూం నిలయం తరఫున రూ. 10వేల ఆర్థిక సాయాన్ని నిలయం సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటక సుబ్బారెడ్డి, శాసనాల వీరబ్రహ్మం, వై.చలమయ్య, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆదినారాయణకు నగదు అందజేస్తున్న రీడింగ్ రూం నిలయం సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఏబీఎం పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఏబీఎం ఉన్నత పాఠశాలలో 1998-99వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలనాటి అనుభవాలు, జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.. తమ గురువులను ఘనంగా సన్మానించారు. ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల మంచి సంబంధాలు, స్నేహాలు, ఆత్మీయతలను పొందవచ్చని గురువులు వారికి సూచించారు.

నీటి వృథా .. తప్పని వ్యధ


సింగిల్ ఫేజ్ మోటార్ నుంచి వృథాగా పోతున్న నీరు

రాచర్ల మండలం చిన్నగానిపల్లిలో తాగునీరు వృథాగా పోతోంది. రెండు నెలల కిందట గ్రామంలోని బోర్లలో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో ప్రజలు మంచి నీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వర్షాలు కురవడంతో ఊళ్లోని కొన్ని బోర్లకు నీరు వస్తుండటంతో ప్రజల ఇబ్బందులు కొంతమేర తీరాయి. గ్రామంలోని రెండు సిగిల్ ఫేజ్ మోటార్ల వద్ద జలం పట్టుకుంటున్నారు. బిందెలతో నీటిని పట్టుకున్న తర్వాత వాటిని ఆపకపోవడంతో విలువైన జలం వృథాగా పోతోంది. పంచాయతీ అధికారులు ఈ వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి జలం వృథా కాకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, కంభం (రాచర్ల).

వర్షం వచ్చిందంటే బురదమయం


అధ్వానంగా మారిన ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణం

వై. పాలెం ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణం వర్షం వచ్చిందంటే బురదమయంగా మారుతోంది. రూ. 23కోట్లతో 100 పడకల ఆసుపత్రి కట్టి దాని ప్రాంగణం బాగు చేయకుండా గాలి కొదిలేసినట్లుగా ఇక్కడి వైద్యశాల పరిస్థితి అపరిశుభ్రతకు నోచుకుంది. ఈ వైద్యశాలకు రోజుకు సుమారు వెయ్యి మంది ఓపీకి వస్తుంటారు. బయట నుంచి వచ్చిన వారు వైద్యశాల ప్రాంగణంలోకి అడుగు పెట్టాలంటే భయపడుతున్నారు. ఇక్కడ కొందరు జారి పడిన సందర్భాలున్నాయి. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి వైద్యశాల ప్రాంగణాన్ని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

బతుకమ్మకు ప్రత్యేక పూజలు


మార్కాపురం పట్టణంలో బతుకమ్మ నృత్యాలు చేస్తున్న మహిళలు

పుల్లలచెరువులోని రామాలయంలో దసర శరనవరాత్రులు పూజలు అందుకున్న బతుకమ్మను పదో రోజు అయిన దసరా పండుగ రోజున గ్రామంలో ఊరేగించి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. మార్కాపురం పట్టణంలోని చెన్నకేశవనగర్ 9వ బ్లాక్‌లో దుర్గామాతతో పాటు బతుకమ్మలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి మహిళలు బతుకమ్మ నృత్యాలు చేశారు. పూజల అనంతరం నిమజ్జనం చేశారు.
– న్యూస్‌టుడే, పుల్లలచెరువు, మార్కాపురం పట్టణం


పుల్లలచెరువులో బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ నృత్యం చేస్తున్న మహిళలు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
పొదిలి : 8008550360
కంభం : 8008632343

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే



సమస్య : రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయ సమీపంలో సిమెంట్ రహదారిపై గుంత ఏర్పడింది. స్వామి వారి దర్శనానికి వచ్చే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. గుంతను పూడ్పించాలి.
– శ్రీనివాసులు, భక్తుడు

సమాధానం : ఏర్పడిన గుంతను పూడ్పించేందుకు చర్యలు తీసుకుంటాం. – రమేష్, ఆలయ ఈవో, నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయం

తోపుడు బండి అందజేత

కంభం (రాచర్ల) : రాచర్ల మండల జనసేన పార్టీ అధ్యక్షుడు పుట్టా బాలకృష్ణ శనివారం అనంపల్లి గ్రామానికి చెందిన ఎస్. రామ్మూర్తికి భాగ్యలక్ష్మి దంపతులకు స్వయం ఉపాధి కోసం తోపుడు బండి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ప్రింటింగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే..

పొదిలి, న్యూస్‌టుడే : పొదిలి పాతూరులో నూతనంగా ఏర్పాటు చేసిన సాయిజ్యోతి ఫ్లెక్సీ ప్రింటింగ్‌ను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి జి.భాస్కర్, నాయకులు కె.వెంకటనారాయణబాబు, వెంకట్రావు, నారాయణప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉర్దూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.హకీమ్‌ఖాన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని రెండో వార్డు మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతలు కలిగిన వారికి ప్రమోషన్లు కల్పించాలని, ఉర్దూ మాట్లాడేవారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అంగన్‌వాడీ సెంటర్లు ప్రారంభించాలని, పాఠాల పుస్తకాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో రూట కార్యవర్గ సభ్యులు, ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.హకీమ్‌ఖాన్

రుధిర రహదారి

● నిత్యం ప్రమాదాలు ● గాలిలో కలుస్తున్న ప్రాణాలు


కమల పాఠశాల సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

తర్లుపాడు, న్యూస్‌టుడే :

తర్లుపాడు-మార్కాపురం రహదారి నిత్యం రక్తమోడుతుంది. కేవలం పది కిలో మీటర్ల రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలో వాహన రద్దీ ఎక్కువగా ఉండటంతో అధిక సంఖ్యలో సొంత వాహనదారులు వయా తర్లుపాడు మీదుగా మార్కాపురం పట్టణానికి వెళ్తుంటారు. సింగిల్ రోడ్డు కావడం, శిథిలావస్థకు చేరడంతోపాటు గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలు కుటుంబాలు వీధిన పడుతున్నాయి. కంభం, మార్కాపురం వయా తర్లుపాడు మీదుగా ఉన్న రోడ్డును అభివృద్ధి చేసేందుకు ఏ ఒక్కరూ చొరవ చూపటం లేదు..

ఎన్నికల సమయంలో.. హామీలు...:

ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు ఈ రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరిస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం హయంలో ఎన్నికైన ప్రజాప్రతినిధి కూడా ఈ రోడ్డును విస్తరిస్తానని హామీ ఇచ్చి అయిదేళ్లుగా పట్టించుకోనేలేదు. తట్టెడు మట్టి పోయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక్కడి తెదేపా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా మొక్కటి ఎన్నిక ప్రచారంలో మార్కాపురం జిల్లా ఏర్పాటుతోపాటు అంతర్భాగంగా ఉన్న తర్లుపాడు రోడ్డును విస్తరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చి వంద రోజులపైనా కావస్తోంది. డబుల్ రోడ్డు విస్తర్ణ దేవుడికెరుక.. ప్రస్తుతం మోకాళ్ల లోతు గుంతలను ముందు పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.


తర్లుపాడులో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కంభం మండలవాసి (పాత చిత్రం)

మూడు వారాల్లో...ఇద్దరు మృతి



రహదారిలో రద్దీ ఎక్కువగా ఉండటం, గుంతల్లో వాహనాన్ని అదుపుచేయలేకపోవడం నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వమైనా గుంతలను పూడ్చించే పనులు చేపట్టకపోవడంతో మూడు వారల్లోనే నాలుగు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇద్దరు వ్యక్తులు ప్రమాదంలో మృతి చెందగా, ఆరుగురు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రుల్లో చేరి రూ. లక్షలు ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చింది. –మీరావలి, ద్విచక్ర వాహనదారుడు, తుమ్మలచెరువు



ఆర్అండ్‌బీ అతిథిగృహం గేటుకు తాళం వేసిన దృశ్యం

నిరుపయోగంగా అతిథి గృహం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి లోని ఆర్అండ్‌బీ అతిథిగృహం మూతపడింది. ఏడాదిగా తాళం వేసి ఉంచుతున్నారు. జిల్లాకు నడికూడలిగా ఉన్న పొదిలిలో అధికారులు, ప్రజాప్రతినిధులు క్యాంపులకు వెళ్లినప్పుడు ఇక్కడ కొద్దిసేపు ఆగి వెళ్లే వారు. గతంలో వివిధ పర్యటనల నిమిత్తం వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడే బస చేసేవారు. గత ప్రభుత్వం ప్రభుత్వ అతిథిగృహం నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రధాన గేట్‌కు తాళం వేశారు. గృహంలో రెండు గదులు, సేద తీరేందుకు మంచాలు, కుర్చీలు ఉన్నాయి. నీటి వసతి లేకపోవడం, విద్యుత్తు వైరింగ్ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. మంచాలు, కుర్చీలు పాతవైపోయాయి. ఫంకాలు మరమ్మతులకు గురయ్యాయి. చిన్నపాటి సమావేశాలు నిర్వహించుకోవాలన్నా లోపల ఉండలేని పరిస్థితి నెలకొంది. కనీసం రంగు కూడ వేయకపోవడంతో చూడటానికి అసహ్యంగా ఉంది. గదుల్లో ఉన్న సీలింగ్ దెబ్బతిని రంధ్రాలు పడ్డాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.


పొదిలి : వాసవీ ఆలయంలో వివిధ వేషధారణలో చిన్నారులు


గిద్దలూరు : ముండ్లపాడులో కోలాట ప్రదర్శన

ఘనంగా ముగిసిన దసరా వేడుకలు

బాలాత్రిపురసుందరీదేవి, త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయాల్లో ఈ నెల 3 నుంచి ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి సింహ వాహనంపై త్రిపురాంతకం వీధుల్లో గ్రామోత్సం నిర్వహించారు. మార్కాపురం, బేస్తవారపేట, కంభం, పొదిలి, గిద్దలూరు, బేస్తవారపేట, యర్రగొండపాలెంలో శనివారం, ఆదివారాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. కంభంలో కోటా సత్యమాంబ దేవికి, గిద్దలూరు మండలం ముండ్లపాడులో, కొమరోలులో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. పొదిలమ్మ దేవాలయంలో నిర్వహించిన పార్వేట ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వాసవీ అమ్మవారి విగ్రహానికి ఊరేగించారు. చిన్నారులు వివిధ వేషధారణలో అలరించారు. పది రోజులుగా జరుగుతున్న దసర శరన్నవరాత్రులు గ్రామోత్సవంతో ముగిశాయి.
– న్యూస్‌టుడే బృందం


కంభం : గ్రామోత్సవంలో కోటా సత్యమాంబదేవి


పుల్లలచెరువులో రాజరాజేశ్వరి దేవిగా


త్రిపురాంతకంలో నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


కంభం : కాపా వీధిలో పార్వేటకు వెళ్తున్న వేంకటేశ్వరస్వామి


భూపతిపల్లెలో పార్వేట ఉత్సవానికి బయలుదేరి వెళ్తున్న శ్రీరాముడు

వైభవంగా పార్వేట ఉత్సవం


గిద్దలూరులో గ్రామోత్సవాన్ని ట్రాక్టర్ నడిపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని మార్కాపురం పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో చెన్నకేశవుడి, కంభంలోని కాప వీధిలో కొలువైన వేంకటేశ్వర స్వామి, రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్వేట ఉత్సవాన్ని వైభవంగా చేపట్టారు. గిద్దలూరులో వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని ట్రాక్టర్ నడిపి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. డప్పు కళాకారుల నృత్యాలు అలరించాయి. కొమరోలులో లక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామిని రథంపై కొలువు దీర్చి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.– న్యూస్‌టుడే బృందం


కొమరోలులో రథోత్సవం

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని గార్లపేట బీసీకాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. వర్షాలకు నీరు నిలిచి దోమలకు నిలయంగా మారుతుంది.
– వెంకటరావు, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వెంటనే శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తాం.
– నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి

సమస్య: మర్రిపూడి శివాలయం వీధిలో కాలువ లేక మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. చిరుజల్లులు కురుస్తుండటంతో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది.
– బాలగురవయ్య, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వీధులను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తాం. కాలువలకు ప్రతిపాదనలు తయారు చేయించి పంపించాం.
- శ్రీనువాసులు, పంచాయతీ కార్యదర్శి

కనిగిరి వైద్యశాలకు దాతల విరాళం


ఎమ్మెల్యే ఉగ్రకు నగదు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి ప్రతినిధులు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి సామాజిక వైద్యశాల అభివృద్ధికి బ్రిటన్‌లో ఉంటున్న పట్టణానికి చెందిన సానికొమ్ము ప్రతాప్‌రెడ్డి తన ప్రతినిధులు సానికొమ్ము మురళీధర్‌రెడ్డి, గుడిపాటి రవికుమార్‌రెడ్డి, కోటపాటి రమేష్‌రెడ్డి ద్వారా రూ.1 లక్ష నగదును ఆదివారం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ.. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.
● సీహెచ్‌సీ అభివృద్ధికి బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రూ. 57,500లు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కనిగిరి
•కనిగిరి •దర్శి •కొండపి

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి ప్రభావంతో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్య శాఖ జేడీ చంద్రశేఖరరావు తెలిపారు. మండలంలోని పాకల సముద్ర తీరం వెంబడి ఆదివారం సాయంత్రం గ్రామ సర్పంచి సైకం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. సింగరాయకొండ మండల తీరప్రాంతంలో తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని కోరారు. లోతట్టు ప్రాంత ప్రజలను ముందస్తు చర్యల్లో భాగంగా సురక్షిత ప్రాంతాలకు తరలించి తగిన వసతులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పడవలు, వలలు తీరం వెంబడి లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మండల మత్స్యశాఖ అధికారి వర్షిణి, ఎస్సై మస్తాన్ షరీఫ్, సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బృందావనమిది.. అందరిదీ..

◗ ఆహ్లాదం పంచుతున్న వేంకటేశ్వర దేవస్థానం పార్కు


రాధాకృష్ణుల విగ్రహాలు

కనిగిరి, న్యూస్‌టుడే:

ప్రస్తుత సమాజంలో మనిషి తీరిక లేకుండా గడుపుతున్న కాలమిది. ఉదయం నిద్ర లేచింది మొదలు తిరిగి రాత్రి పడుకునే వరకు అంతా ఉరుకు పరుగులే. చిన్నారులతో కాస్త సమయంలో ఆహ్లాదంగా గడపాలంటే కనిగిరి పట్టణంలో కనీస సౌకర్యాలు కానరాకున్నాయి. అయితే ఈ లోటును కనిగిరి వెంకటేశ్వర దేవస్థానంలోని బృందావనం పార్కు తీరుస్తోంది. మనోహరంగా ఉండి అలసి, సొలిసిన మనసులకు సాంత్వన చేకూరుస్తోంది. చిన్నారులు, విద్యార్థులు, మహిళలు వృద్ధులతో పాటు, భక్తులు సెలవు రోజుల్లో, పండుగ పర్వదినాల్లో కాసేపు సేద తీరేందుకు ఇక్కడకు వస్తున్నారు. ఉద్యోగులు సైతం తమ కుటుంబ సభ్యులతో వచ్చి కలిసి ఆహ్లాదంగా గడుపుతున్నారు.

ఆకట్టుకునే దేవతామూర్తుల విగ్రహాలు..

ప్రధానంగా బృందావనంలో వివిధ రకాల చెట్లతో పాటు దేవతామూర్తుల విగ్రహాలు విశేషంగా అలరిస్తున్నాయి. సూర్య భగవానుడు గుర్రాలపై స్వారీ చేసే విగ్రహం ఆకట్టుకుంటుంది. శ్రీనివాసుడు పుట్టలో నుంచి ఆవు పాలుతాగే విగ్రహం, వేంకటేశ్వరుడి శంకు చక్ర నామాలు, ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, శ్రీ కృష్ణుడు, రాధ, శివపార్వతులు విగ్రహాలు, దీంతో పాటు పార్కుకు వచ్చే మార్గంలో విష్ణుమూర్తి అవతారాలు, లక్ష్మీదేవి అవతారాల విగ్రహాలు ఇట్టే కట్టి పడేస్తున్నాయి. ఆ దేవమూర్తులను చూస్తున్నంత సేపు తెలియకుండానే భక్తి పరవశంలోకి జారుకుంటాం. దీంతోపాటు సందర్శకులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 దాటిందంటే చాలు సందర్శకులతో కిటకిటలాడుతుంది. మొత్తం మీద కనిగిరి పట్టణవాసులకు బృందావనం ఇప్పుడు ఆహ్లాదాన్ని పంచే ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది.


శివపార్వతుల విగ్రహం


పుట్టలో గోమాత పాలుతాగుతున్న శ్రీనివాసుడు


బృందావనంలో అశ్వాల స్వారీ చేస్తున్న సూర్యభగవానుడు


పార్కులో ఆహ్లాదం పంచుతున్న జమ్మిచెట్టు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

దర్శి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో నిధులు లేమితే గ్రామ పంచాయతీలు దిష్టి బొమ్మల్లా మారాయని.. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక పల్లెల దశ మారేలా చర్యలు చేపట్టిందని తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే పల్లె పండగ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు. గ్రామాల్లో రోడ్లు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యలకు కార్యక్రమంలో పరిష్కారం దొరుకుతుందన్నారు.
● పల్నాడు జిల్లా నరసరావుపేటలోని గొట్టిపాటి లక్ష్మి నివాసంలో చీరాల శాసనసభ్యుడు ఎం.ఎం. కొండయ్య ఆదివారం లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. పలు రాజకీయ అంశాలతో పాటు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో డా.కడియాల వెంకటేశ్వరరావు, రమేష్, డా.లలిత్‌సాగర్ పాల్గొన్నారు.

మది నిండా జ్ఞాపకాలు పదిలం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

కురిచేడు, న్యూస్‌టుడే: 2001-2002 విద్యా సంవత్సరంలో కురిచేడు బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 23 ఏళ్ల తరవాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అన్వర్, సురేంద్ర, బాలక్రిష్ణ, నరేష్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● 2000-2001 విద్యా సంవత్సరంలో కురిచేడు రాఘవేంద్ర పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం శనివారం గుంటక నాసరరెడ్డి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. 24 ఏళ్ల తరవాత ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమావేశంలో ఒకరినొకరు కలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. రోజంతా ఆటలు, పాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో కిషోర్, వెంకటరెడ్డి, మోహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగదు.. దోమ చావదు..

దర్శి, న్యూస్‌టుడే: దర్శిలో టీచర్స్ కాలనీ ప్రారంభంలో మురుగునీరు రోడ్డుపైకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించకపోవటంతో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దుర్వాసనతో వ్యాపించడంతో పాటు దోమలకు ఆవాసంగా మారుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. గత రెండు నెలలుగా నగరపంచాయతీ అధికారులకు సమస్య చెప్పినా పట్టించుకోవటంలేదని వారు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం కావటంతో కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై కమిషనర్ మహేష్‌ను వివరణ కోరగా.. సిబ్బందిని పంపి కాలువల్లో మురుగును తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కాలువల్లో ముందుకు కదలని మురుగు

హెడ్ కానిస్టేబుల్‌కు సిబ్బంది బాసట

పీసీపల్లి, న్యూస్‌టుడే: పీసీపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ బి. రవికుమార్ ఈనెల 8న కనిగిరిలో ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తూ హఠాత్తుగా కుప్పకూలిపోయారు. ప్రస్తుతం ఆయన ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పీసీపల్లి ఎస్సై జి. కోటయ్య సిబ్బందితో కలసి ఆదివారం రాత్రి బాధితుడిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రూ. 50 నగదును కుటుంబ సభ్యులకు అందించారు.


పాకల తీరం వెంబడి స్నానాలు ఆచరిస్తున్న సందర్శకులు

పాకలలో పర్యాటకుల సందడి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా పర్వదినం ముగియడం, ఆదివారం కావడంతో మండలంలోని పాకల సముద్రతీరం సందర్శకులతో కోలాహలంగా మారింది. వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, యువత, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని సముద్రంలో స్నానాలు చేసి సేదతీరారు. వాతావరణ శాఖ సోమవారం నుంచి తుపాన్ హెచ్చరికలు జారీ చేయడంతో సముద్ర తీరం కెరటాలతో ఎగసిపడుతూ సుమారు 30 అడుగుల మేర ముందుకొచ్చింది. తీరం వెంబడి రామాయపట్నం మెరైన్ ఎస్సై మస్తాన్‌షరీఫ్ సిబ్బందితో గస్తీ నిర్వహించి పర్యాటకులకు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సుమారు 2 వేల మంది సందర్శకులు కందుకూరు, కొండపి, కనిగిరి నియోజకవర్గాల నుంచి వివిధ వాహనాల్లో తరలివచ్చినట్లు సమాచారం.

నేటి నుంచి పల్లె పండగ వారోత్సవాలు

తాళ్లూరు: రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 'పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాల' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ కె.సుందరరామయ్య తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇతర శాఖల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మండలంలో 58 పనులకు రూ. మూడుకోట్ల మేరకు నిధులు కూడా మంజూరయ్యాయని వివరించారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం అందజేత

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కొలనీడు నారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమై ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న పామూరు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సంస్థ తరపున రూ.5 వేలు, దాతలు స్పందించి ఇచ్చిన రూ.25 వేలు మొత్తం రూ.30 వేల నగదును బాధితుడికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షుడు ఎం.ముసలయ్య, ప్రతినిధులు టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి డిమాండ్

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు గ్రామానికి తలెత్తిన తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. టంగుటూరు గ్రామ శాఖ మహాసభలను ఆదివారం రైల్వేస్టేషన్ సమీపంలో నిర్వహించారు. ముందుగా సీపీఎం జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.ఆంజనేయులు మాట్లాడుతూ.. టంగుటూరు గ్రామస్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామ శివారులోని రాగాయకుంట 26 ఎకరాలను చెరువుగా మార్చి పాలేరు, ముసి వాగుల నీటిని లిఫ్టుల ద్వారా చెరువుకు అందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో టంగుటూరి వెంకటరావు, వినోద్, యానాది, కొండయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరావు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


దర్శిలో రాజరాజేశ్వరీదేవిగా పోలేరమ్మ తల్లి


మారెళ్లలో రాజరాజేశ్వరిగా భ్రమరాంబ అమ్మవారు


కనిగిరి: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


తాళ్లూరు: గ్రామోత్సవంలో దేవదేవుళ్లు


పామూరులో కన్యకాపరమేశ్వరి ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

వైభవంగా దసరా ఉత్సవాలు

దర్శి, కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లో ప్రజలు శనివారం దసరా పండగ ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాలన్నీ భక్తులతో సందడితో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ప్రజలందరూ దేవాలయాలకు తరలివెళ్లి పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పామూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారు బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన వసంతోత్సవం, ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. తాళ్లూరు, తూర్పుగంగవరం, లక్కవరం, బొద్దికూరపాడు, కొత్తపాలెం, తదితర గ్రామాల్లో పారువేట ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అక్కడి జమ్మిచెట్టుకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేసి దేవదేవుళ్లకు గ్రామోత్సవం నిర్వహించారు. తాళ్లూరులోని బస్టాండు సెంటరులో ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కనిగిరి, దర్శి, టంగుటూరు పోలీస్ స్టేషన్లలో పోలీసు సిబ్బంది ఆయుధ పూజ నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం


పామూరులో బంగారు చీరలో వాసవీ మాత

పోలేరమ్మకు పొంగళ్లు


పోలేరమ్మ ఆలయానికి బోనాలతో ప్రదర్శనగా తరలి వెళుతున్న భక్తులు

తాళ్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని బొద్దికూరపాడు కొలువైన పోలేరమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పొంగళ్లతోపాటు నేవేద్యాల బోనాలతో పెద్ద ఎత్తున మహిళలు, ఇతర భక్తులు తరలి వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు..

కనిగిరి: కనిగిరి వెంకటేశ్వర దేవస్థానంలో దసరా బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రితో ముగిసాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ● సి.ఎస్.పురం: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.

శిరస్త్రాణం తప్పనిసరి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహన చోదకులు విధిగా శిరస్త్రాణం ధరించి వాహనాలను నడపాలని ఎస్సై ఆర్.సుమన్ సూచించారు. సి.ఎస్.పురంలోని ప్రధాన రహదారిలో ఆదివారం ఆయన వాహనాలను తనిఖీచేశారు. రహదారి నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న 10 వాహనాలకు ఈ-చలనా విధించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

దర్శి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదంలో ఇద్దరికి గాయలయ్యాయి. ఈ సంఘటన శనివారం ఉదయం పొదిలి రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పుట్ట బజారుకు చెందిన వెంకటేశ్వర్లు, క్రిస్టియన్‌పాలెంకు చెందిన ప్రేమ్‌కుమార్ ఒకే ద్విచక్ర వాహనంపై పొదిలి రోడ్డులో నుంచి పట్టణానికి వస్తున్నారు. దద్దాలమ్మ ఆలయం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వారిద్దరూ గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.
హనుమంతునిపాడు: మండలంలోని జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. తిమ్మారెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వేశపోగు బాబు తిమ్మారెడ్డిపల్లి నుంచి ఎస్సీకాలనీకి ద్విచక్రవాహనంపై వస్తూ అదుపు తప్పి గాయపడ్డారు. కొత్తూరు గ్రామానికి చెందిన పొనుగోటి నారాయణరెడ్డి కొండారెడ్డిపల్లికి ద్విచక్రవాహనంపై రోడ్డు పక్కన ఉన్న గుంతను గమనించక తీవ్రంగా గాయపడ్డారు.

మద్యం సీసాల పట్టివేత

వెలిగండ్ల, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై మధుసూదన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు మండలంలోని మొగుళ్లూరు వద్ద తనిఖీలు సిబ్బంది చేపట్టారు. అందులో భాగంగా మొగుళ్లూరు గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి అనే వ్యక్తి ద్వి చక్రవాహనంపై తీసుకెళ్తున్న 48 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూదశిబిరంపై దాడి

మర్రిపూడి, న్యూస్‌టుడే: మండలంలోని గుండ్లసముద్రం సమీపంలోని పొలాల్లో నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని.. వారి నుంచి రూ.6,910 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

సుంకిరెడ్డిపాలెం విద్యుదాఘాతంతో..

పొన్నలూరు: విద్యుదాఘాతంతో ఓ గెదే మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని సుంకిరెడ్డిపాలెం చెందిన వరికూటి రవణమ్మ పెంచుకుంటున్న గెదే రోజు శివన్నపాలెం గ్రామానికి మధ్యలో ఉన్న చెరువు వద్దకు మేత, నీళ్ల కోసం వెళ్లి వస్తోంది. శనివారం ఈ క్రమంలో అది దారి తప్పి శివన్నపాలెంనికి చేరుకుంది. అక్కడే ఓ విద్యుత్తు తీగకు తగిలి మృతి చెందింది.

తగరం నిషేధం.. కాగితాలకే పరిమితం..

దర్శి, న్యూస్‌టుడే:

ఒకసారి వినియోగించే తగరపు వస్తువులపై పూర్తి నిషేధం అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దర్శి పురపాలిక పరిధిలో అడపా, దడపా జరిమానాలు విధిస్తూ అధికారులు చేతులు దలుపుకుంటున్నారు. ఫలితంగా గతంతో పోలిస్తే ప్లాస్టిక్ వినియోగం రెండింతలు పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. దర్శి నగరపంచాయతీ పరిధిలో నిత్యం 20 టన్నుల చెత్త తయారువుతోంది. వాటిల్లో అధికశాతం ప్లాస్టిక్ వస్తువులు వస్తున్నాయి.


నగర పంచాయతీ ఓ వీధిలో మురుగు కాలువలో తగరపు వస్తువులతో నిండిన దృశ్యం

అడ్డదారుల్లో పరఫరా...

ప్రజలు తాము కొనుగోలు చేసిన చిన్న, పెద్ద వస్తువులను తగరపు సంచుల ద్వారా తరలించటం అలవాటుగా మారింది. వీటికి తోడు శుభకార్యాలతో పాటు ఇతర కార్యక్రమాల్లో భోజనాలు, బహుమతులు అందించటానికి తగరపు వస్తువులు విపరీతంగా వాడుతున్నారు. వాడిన అనంతరం వీటిని ఎక్కడ పడితే అక్కడ డంప్ చేయటంతో గాలికి అవి రైతులు సాగు చేస్తున్న పొలాల్లోకి, ప్రధాన రహదారులపైకి చేరి తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. భూమిలో కరిగే అవకాశం లేకపోవటంతో పర్యావరణానికి పెనుభూతంగా మారటంతో పాటు, వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుంది. మార్కెట్‌లో తక్కువ ధరలకే ఇవి లభ్యం కావటంతో వ్యాపారులు, తోపుడుబండ్ల యజమానులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. 50 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం ఉన్న తగరపు సంచులు రూ.2 నుంచి రూ.3 ల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. కనిగిర, నరసరావుపేట తదితర ప్రాంతాల నుంచి ఈ తగరపు సంచులు యథేచ్ఛగా అవసరమైన వారికి గుట్టుచప్పుడు కాకుండా చేరవేస్తున్నారు. గతంలో నిషేధం విధించిన సమయంలో వీటి విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్న ప్రామాణిక, జూటు సంచుల ధరలు పెరగటంతో క్రమంగా తిరిగి తగరపు సంచులవైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు.


పండ్లు, కూరగాయలను ప్లాస్టిక్ సంచుల్లోనే తరలింపు

చట్ట ప్రకారం ఇవీ చర్యలు...

1986 పర్యావరణ పరిరక్షణ ప్రత్యేక చట్టం ప్రకారం ప్లాస్టిక్ ఉత్పత్తులు తయారీ, అమ్మకాలను నిషేధించారు. వాటిని తయారు చేసినా, అమ్మకాలు జరిపినా, వినియోగించినా రూ. 1500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధించవచ్చు. తయారీ, అమ్మకాలు జరుపుతున్న సంస్థలకు రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారు. అప్పటికీ మార్పు రాకుంటే చట్టప్రకారం లైసెన్సులు రద్దు చేస్తారు. జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, చీమకుర్తి, కనిగిరి, దర్శి, పొదిలి తదితర ప్రాంతాల్లో తగరపు వస్తువుల విక్రయ, వినియోగం యథేచ్ఛగా సాగుతున్నాయి. నోటీసులు ఇచ్చినా.. జరిమానాలు విధించినా ఎంతమాత్రం మార్పు రావటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యావరణంపై ప్రజలకు అవగాహన పెంచటం.. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు వివరించడం వంటి కార్యక్రమాలు ద్వారా తగరపు ఉత్పత్తులను తగ్గించవచ్చు. దీనిపై నగరపంచాయతీ కమిషనర్ మహేష్‌ను వివరణ కోరగా 125 మైక్రాన్లకు తక్కువగా ఉన్న తగరపు వస్తువుల వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అదుపు చేస్తామన్నారు. ప్రతిరోజూ సిబ్బందితో తనిఖీలు నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధిస్తామన్నారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

కర్రసాములో ప్రతిభ



ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలుకు చెందిన టి.జయశ్రీ రెడ్డి కర్రసాములో బ్లాక్‌బెల్ట్ సాధించింది. తమిళనాడులోని వెల్లూరు షుగర్ మిల్స్ మైదానంలో ఈ నెల 4 నుంచి 13 వరకు నిర్వహించిన శిలంబం (కర్రసాము) శిబిరంలో పాల్గొని సత్తా చాటింది. రాష్ట్రంలో కర్రసాములో బ్లాక్ బెల్ట్ సాధించిన తొలి క్రీడాకారిణిగా ఆమె గుర్తింపు పొందారని సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేటి నుంచి 'పల్లె పండగ'

మద్దిపాడు: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండగ వారోత్సవాలను ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించనున్నారు. ఏడుగుండ్లపాడు, మద్దిపాడు, వెల్లంపల్లి, దొడ్డవరం, ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. వారోత్సవాలను జయప్రదం చేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో డీవీఎస్ ప్రసాద్ కోరారు.

చదరంగం పోటీలకు ఎంపిక



విజేతలతో సంఘ ప్రతినిధులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: హైదరీ క్లబ్‌లో జరుగుతున్న అండర్-15 జిల్లాస్థాయి బాలబాలికల చెస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో సాయి తనీష్, షఫీజ్, విఘ్నేష్ గుప్తా, అర్హాన్; బాలికల విభాగంలో... సునయన, పాణ్య శ్రీవల్లి, విజ్ఞశ్రీ, మేఘనరెడ్డి విజేతలుగా నిలిచినట్లు సంఘం కార్యదర్శి ఎస్కే అబ్దుల్‌నబీ తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. సుకాంత్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

ఏళ్లుగా యాతన... కావాలి సాంత్వన

● ఎమ్మెల్యే దామచర్ల దృష్టికి కాలనీల సమస్యలు

● నెల రోజుల్లో పరిష్కారానికి హామీ




ఉద్యోగులు, వ్యాపారులు ఎక్కువగా నివసించుండే కాలనీలవి. అటువంటి ప్రాంతాల్లోనూ చిన్న చిన్న సమస్యలు ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోక... నిత్యం వందలాది మంది ఇబ్బందులు పడుతున్నారు. కంట్లో నలుసులా మారిన అలాంటి చిక్కులను... ఆయా ప్రాంతాల అభివృద్ధి కమిటీల సభ్యులతో మాట్లాడి 'న్యూస్‌టుడే' సేకరించింది. వాటిని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి తీసుకువెళ్లింది. ఆయన సానుకూలంగా స్పందించి... నెల రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

తవ్వేసి తంటాలు మిగిల్చారు...





సమస్య: నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే భాగ్యనగర్ - హౌసింగ్‌బోర్డు రహదారి నిండా గోతులతో అధ్వానంగా తయారైంది. భూగర్భంలో ఉన్న ప్రధాన తాగునీటి పైపులైను కాలదోషం పట్టి తరచూ లీకవుతోంది. ఆయా సమయాల్లో మరమ్మతుల కోసం రోడ్డును తవ్వి... మళ్లీ సరిగా కప్పకపోవడమే సమస్యకు ప్రధాన కారణం. ఆయా గుంతలు క్రమంగా విస్తరించడంతో పాటు... వర్షాలకు నీరు చేరి ప్రయాణం నరకప్రాయంగా ఉంటోంది. ప్రమాదాలూ చోటు చేసుకుంటున్నాయి. అత్యవసరంగా గోతులు పూడ్చింది... తరువాత శాశ్వత ప్రాతిపదికన కొత్త పైపులైన్ వేసి, రహదారి పునర్నిర్మించాలి.

– ఆళ్ల వెంకటేశ్వరరావు, భాగ్యనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

ఎమ్మెల్యే: ఎన్నికల సమయంలో ఈ రహదారిని పరిశీలించాం. స్థానికులూ సమస్య నా దృష్టికి తెచ్చారు. మొదట... గుంతలు పూడ్పించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే పాత పైపులైన్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తాం.

ఆటస్థలంలో వ్యర్థాలతో అవస్థ...





సమస్య: గద్దలగుంటలో ఖాళీగా ఉన్న దేవాదాయశాఖ స్థలాన్ని స్థానిక యువత, పాఠశాల పిల్లలు గతంలో క్రీడాప్రాంగణంగా వినియోగించుకునే వారు. మూడేళ్లుగా దానిని పట్టించుకోకపోవడంతో చిల్ల చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. మరోవైపు వ్యర్థాలు పారబోస్తుండడంతో ఇతరత్రా సమస్యలు తలెత్తుతున్నాయి. ఆ జాగాను శుభ్రం చేయించాలని స్థానికులు చాన్నాళ్లుగా కోరుతున్నా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా వ్యర్థాలు తొలగించి, మెరక తోలితే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది.

– ఆరిగ శ్రీనివాసరావు, గద్దలగుంట అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

ఎమ్మెల్యే: త్వరలోనే ఆ స్థలాన్ని శుభ్రం చేయించి పిల్లలు ఆడుకునేందుకు వీలుగా తయారు చేస్తాం. నగరంలోని క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి కూడా కార్యాచరణ రూపొందించనున్నాం.

పార్కులో నీరు నిలిచి ఇక్కట్లు...





సమస్య: వాకింగ్ ట్రాక్‌తో పాటు, మహిళలకు ప్రత్యేకంగా జిమ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండడంతో... చెన్నకేశవస్వామి లేఅవుట్‌లోని ఎన్‌టీఆర్ పార్కుకు నిత్యం వందలాది మంది వస్తుంటారు. గతంలో పార్కులో చేరే నీరు పక్కనున్న ఖాళీ జాగాల్లోకి వెళ్లేవి. ఇప్పుడు ఆయా స్థలాల్లో నిర్మాణాలు చేపట్టడంతో ఉద్యానంలోనే నీరు నిలిచి సమస్య నెలకొంటోంది. పార్కు దక్షిణం వైపు గోడ వెనుకగా కచ్చాకాలువ తీయిస్తే సమస్య ఉండదు.

– చెన్నుపాటి ప్రసాద్, ఎన్టీఆర్ పార్కు, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి

ఎమ్మెల్యే: రెవెన్యూకాలనీ, సుజాతానగర్, ఆ పరిసర ప్రాంత ప్రజలు ఎక్కువగా వినియోగించుకుంటున్న పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతాం. కమిటీ వారి విజ్ఞప్తి మేరకు త్వరలోనే కచ్చా కాలువ తీయిస్తాం.



రంగరాయుడు చెరువు వెనుక రోడ్డు దుస్థితి



కుంగిన కల్వర్టు వద్ద నిలిచిన మురుగు

కల్వర్టు కుంగి కష్టాలు...




సమస్య: నిర్మల్‌నగర్‌లోని ఎన్టీఆర్ బొమ్మ సమీపంలోని కల్వర్టు కుంగిపోయింది. దీంతో ఇటు కాలనీ, అటు అంజయ్య రోడ్డులోంచి వచ్చే మురుగు, వరద ఇక్కడ నిలిచిపోతోంది. భారీ వర్షాల సమయంలో ఇళ్లలోకీ నీరు చేరి మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కల్వర్టు ఎత్తు పెంచితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ● రంగరాయుడు చెరువు వెనుక ఆరామక్షేత్రం నుంచి అంజయ్య రోడ్డును కలిపే మార్గంలో భారీ గుంతలు ఏర్పడి తరచూ దుర్ఘటనలు జరుగుతున్నాయి. ఈ రెండు పనులు చేపడితే వందలాది మందికి మేలు కలుగుతుంది.

– డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, నిర్మల్‌నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

ఎమ్మెల్యే: నగరంలోని అన్ని రహదారుల అభివృద్ధికి ప్రణాళిక తయాకు చేస్తున్నాం. అభివృద్ధి కమిటీ వారు కోరిన విధంగా... కల్వర్టు, రంగారాయుడు చెరువు ఎదుట రోడ్డు పనులు ముందుగా పూర్తిచేస్తాం.

స్తంభాలు, దీపాలు లేక చిక్కులు...





సమస్య: రాజీవ్‌నగర్ (గద్దలగుంట ఎక్స్‌టెన్షన్)లో గెలాక్సీ లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్‌తో పాటు ఆ పరిసరాల్లో మరో మూడు బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. 150కి పైగా కుటుంబాలు ఉంటున్నాయి. ఇక్కడున్న రెండు మార్గాల్లో ఒక దాంట్లో విద్యుత్తు స్తంభాలు లేవు. రెండో దారిలో నాలుగు స్తంభాలున్నా రెండింటికి దీపాలు లేవు. రాత్రివేళ అటుగా రాకపోకలు సాగించేందుకు మహిళలు, పిల్లలు భయపడుతున్నారు.

– ఓగిరాల రాధాకృష్ణమూర్తి, రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధి

ఎమ్మెల్యే: విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి స్తంభాలు వేయిస్తాం. నగర పాలక సంస్థ ద్వారా వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.



మాట్లాడుతున్న డీపీవో వెంకటనాయుడు

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తం

కొత్తపట్నం, నాగులుప్పలపాడు – న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీపీవో జి.వెంకటనాయుడు ఆదేశించారు. కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండల కార్యాలయాల్లో... అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశాలున్న నేపథ్యంలో... ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలను సమన్వయం చేసుకుని ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా గ్రామాల్లో దండోరా వేయించాలని ఆదేశించారు. కనపర్తిలోని తుపాను షెల్టర్ పరిశీలించారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్లు పి.మధుసూదనరావు, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవోలు కృష్ణ, మహాలక్ష్మి పాల్గొన్నారు. ● ఒంగోలు గ్రామీణం: చింతాయగారిపాలెం, గుండాయపాలెం, దేవరంపాడు, బొద్దులూరివారిపాలెం, ఉలిచిలో ఎంపీడీవో రాజశేఖర్, ఈవోఆర్డీ బాలచెన్నయ్య పర్యటించారు. గ్రామ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

'ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తగదు'

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని మాలల ఐకాస ఛైర్మన్ దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన ఐకాస రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల ఐక్యత ఓర్చుకోలేని రాజకీయ పార్టీలు... వారి మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 26న రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు అశోక్‌బాబు, మల్లీశ్వరి, నీలం నాగేంద్రరావు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సాయిబాబా



సాయిబాబా చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అలుపెరగని పోరాట యోధుడు సాయిబాబా అని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు పేర్కొన్నారు. దిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుడు, పౌరహక్కుల ఉద్యమకారుడు సాయిబాబా మృతి నేపథ్యంలో... ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆదివాసీలు, అట్టడుగు వర్గాల హక్కుల పరిరక్షణకు విశేష కృషి చేశారన్నారు. జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు, ప్రజా సంఘాల నాయకులు భీమవరపు సుబ్బారావు, దాసరి సుందరం, పి.శ్రీనివాస్, ఆవుల సుబ్రహ్మణ్యం, అంకయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వైద్య విద్యార్థిని బి.నిత్యశ్రీకి బూచేపల్లి ట్రస్ట్ తరపున జెడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. పేద విద్యార్థులకు ట్రస్ట్ అండగా నిలుస్తుందని తెలిపారు. కౌన్సిలర్ టి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణాలతో అనర్థం

మద్దిపాడు, న్యూస్‌టుడే: కొష్టాలు సెంటర్‌లో ఎస్సై శివరామయ్య, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. అతివేగం, తగిన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనదారులకు జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలను ఆపి... చోదకులు, ప్రయాణికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

దుకాణంలో చోరీకి యత్నం

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉప్పుగుండూరులోని ఓ బైకు మెకానిక్ దుకాణంలో చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సుదనగుంట సులేమన్‌కు గంగమ్మ సెంటర్‌లో ద్విచక్ర వాహన మరమ్మతుల దుకాణం ఉంది. శనివారం రాత్రి... ఈ షట్టర్ తెరిచి లోపలకు చొరబడేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. ఆదివారం ఉదయం విషయం గమనించిన యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కొద్ది రోజుల క్రితం ఇదే కూడలిలోని మరో దుకాణంలోనూ చోరీ యత్నం జరగడం గమనార్హం.

బాలిక అదృశ్యం... ఆచూకీ లభ్యం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 16 ఏళ్ల బాలిక శనివారం రాత్రి అదృశ్యమైంది. ఆమె కుటుంబీకులు ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సాయంత్రానికి ఆచూకీ లభ్యమవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

1.4 కిలోల గంజాయి స్వాధీనం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన మధు, మరో ఇద్దరు వ్యక్తులు గంజాయితో సంచరిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారినుంచి 1.40 కిలోల గంజాయితో పాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరవదికి చెందిన కొనికి పరమేశ్, చందు వెల్లంపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చారు. ద్విచక్ర వాహనంపై శనివారం తిరిగి వెళ్లే క్రమంలో... కొష్టాలు వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయి అదుపు తప్పి పడిపోయారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడులో పంచాయతీ సిబ్బందికి నూతన దుస్తులు పంపిణీ చేశారు. తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడు రావులపల్లి సురేష్ ఆధ్వర్యంలో అంకాలమ్మ దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. 31 మంది సిబ్బందికి దుస్తులు అందజేశారు. పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. పార్టీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచి అంకారావు, ఆలయ మాజీ ఛైర్మన్ నల్లగట్ల శ్రీనివాసరావు, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, మాధవి తదితరులు పాల్గొన్నారు. ● రచ్చబండ, బోరు ప్రారంభం : సంతనూతలపాడు: చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద నూతనంగా నిర్మించిన రచ్చబండ, బోరును ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్... ఆదివారం ప్రారంభించారు. డాక్టర్ కొమ్మి నరసింగరావు, శాంతిప్రియ వితరణతో ఈ నిర్మాణాలు చేపట్టారు. దాతలను అభినందించారు. నాయకులు రావులపల్లి సురేష్, జనార్దన్, సుబ్బారావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067 ఒంగోలు గ్రామీణం : 8008564455

ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766

ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే

?: అంజయ్య రోడ్డులో ఓ సమయం అంటూ లేకుండా నీరిస్తున్నారు. పనులు మానుకుని రోజంతా నిరీక్షించాల్సి వస్తోంది.
– శ్రీనివాసులు, స్థానికుడు

✓: మోటారు మరమ్మతుల కారణంగా సమస్య నెలకొంది. ఇకపై ఎప్పటిలానే నీరందేలా చూస్తాం.
– నరసింహారావు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్

?: కొప్పోలు గాంధీనగర్ కాలనీ రైస్‌మిల్ రోడ్డులో... గత ఇరవై రోజులుగా వీధి దీపం వెలగడం లేదు.

✓: సిబ్బందిని పంపి వెంటనే దీపం ఏర్పాటు చేస్తాం.
– బాలాజీ, సూపర్‌వైజర్

?: భాగ్యనగర్ రెండోలైన్ కాలువలో మురుగు నిలిచి దుర్వాసన వెలువడుతోంది. – కార్తిక్, స్థానిక నివాసి

✓: ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం.
– ఎన్.పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

?: మామిడిపాలెం నుంచి రెడ్డి హాస్టల్ మీదుగా పాత బైపాస్‌కు వెళ్లే దారిలో దీపాలు లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – శ్రీనివాసన్, నగరవాసి

✓: పరిశీలించి... త్వరలో సమస్య పరిష్కరిస్తాం.
– చంద్రయ్య, మున్సిపల్ ఇంజినీర్

చీమకుర్తి, న్యూస్‌టుడే:

?: నెహ్రూనగర్‌లోని రావిపాటి వారి అతిథిగృహం ప్రాంతంలోని వీధి దీపాలు గత కొద్ది రోజులుగా వెలగడం లేదు.
– పి.నరసింహ, స్థానికుడు

✓: వెంటనే మరమ్మతులు చేయిస్తాం.
– గోపి, ఇంజినీరింగ్ పర్యవేక్షకుడు



పెళ్లూరు: రాజరాజేశ్వరిగా



ఉప్పుగుండూరు: అమ్మవారి ఊరేగింపు



హరిహరక్షేత్రంలో పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు



ఒంగోలు: జమ్మి చెట్టు వద్ద యువతుల పూజలు



చీమకుర్తిలో దుర్గమ్మ నగరోత్సవం



సంతపేటలో...



పార్వేట ఉత్సవం తిలకించేందుకు తరలివచ్చిన జనం



ఇసుకవాగు శివాలయంలో...



నగరంలో అమ్మవార్ల ఊరేగింపు సందడి →

కళారాల జాతర... పార్వేట వేడుక

దసరా సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం... నగరంతో పాటు, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీరోడ్డులో నిర్వహించిన పారువేట ఉత్సవం వైభవంగా సాగింది. వాసవీ మాతకు 102 ప్రసాదాలను నివేదించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన దేవీ వైభవం నృత్య రూపకం అలరించింది. గొడుగుపాలెంలో జనసేన ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ● శ్రీగిరి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. స్వామివారి నగరోత్సవం కనులపండువగా సాగింది. స్వర్ణ సుబ్బారావు బృందం ప్రదర్శించిన కోలాటం మైమరపించింది. ● శుక్రవారం అర్ధరాత్రి దాటాక... గంటాపాలెం పార్వతీదేవి, కొత్తపట్నం బస్టాండ్ రోడ్డులో నరసింహస్వామి, కేశవస్వామిపేటలో మహిషాసురమర్దని కళారాల జాతర అంబరాన్నంటింది. పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. వారు పోసి మొక్కులు చెల్లించారు. దేవతా వేషధారణలు, కేరళ వాయిద్యాలు, యువత కేరింతలతో ఊరేగింపు ఆసాంతం కోలాహలంగా సాగింది.

– న్యూస్‌టుడే బృందం



శ్రీగిరి దేవస్థానంలో కోలాట ప్రదర్శన